

2 లో

రాయికోడ్ మండలానికి ముగ్గురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

సంగారెడ్డి మెదక్

ఆదివారం 06 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:15

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## - ప్రజా పాలన 1000 రోజుల విజయోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ప్రజా పాలన 1000 రోజుల విజయోత్సవంలో భాగంగా శనివారం నారాయణఖేడ్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే స్వగృహం నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేని అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేసి చూపించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను దగా చేసిందని ఆరోపించారు.

మిగతా 2 లో

# రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు



- రైతన్న కంట కన్నీరు రేవంత్ పాలనకు నిదర్శనం..
- రైతుల భూములపై 22ఏ నిషేధం ఎత్తివేయాలి..- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయాలి- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి - గుమ్మడిదలలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతన్న పోరుబాట..

2 లో

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాన్ని భారీగా అప్పులపాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పండుగ వాతావరణం నెలకొందని, త్వరలో రెండో విడత ఇళ్లను కూడా మంజూరు చేస్తామని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు మంజూరు చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులను అందించడంతో పాటు కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.47 కోట్లతో ఏటీసీ సెంటర్, రూ.5 కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియం తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేపడుతుంటే మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి జీర్ణించుకోలేక ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు గత పాలన, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకుని ఎంపీ, గ్రామ పంచాయతీ, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

మొదటిపేజీ తరువాయి

**గుమ్మడిదల(ప్రజాజ్యోతి)**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెయ్యి రోజుల పాలనలో వ్యవసాయ రంగం విధ్వంసం రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం 420 మోసాల పైన బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరు బాటలో భాగంగా శనివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతన్న పోరు బాట కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో విప్లవత్మక మార్పులు తీసుకొని రావడంతో పాటు రైతుని రాజు చేస్తానంటూ ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. రైతుబంధు, రైతు బీమా వంటి విప్లవాత్మక పథకాలకు చరమగీతం పాడడంతో పాటు కనీస మద్దతు ధర అందించక రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కేసీఆర్ హయాంలో గ్రామాల సమగ్ర అభివృద్ధి**

తెలంగాణ రాష్ట్ర  సాధన కోసం 14 సంవత్సరాలు పోరాడిన కేసీఆర్.. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు.మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడంతో పాటు రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగానికి అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విద్యుత్ సమస్యల కారణంగా పొలాల్లో మోటార్లు ఆన్ చేసేందుకు వెళ్లిన రైతులు పాముకాట్లకు, ఇతర ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని, ఆ పరిస్థితులను మార్చేందుకు 24 గంటల విద్యుత్ సరఫరా తీసుకొచ్చిన మహోన్నత నాయకుడు కెసిఆర్ అని గుర్తు చేశారు.22ఏ పేరుతో రైతులను వేధించడం సరికాదుప్రస్తుతం జిన్నారం, గుమ్మడిదల తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆరోపించారు. రైతుల భూములను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి వారిని మానసికంగా, ఆర్థికంగా వేధించడం తగదన్నారు.
రైతుల భూముల విషయంలో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవి నుంచి తప్పుకోవాలని, లేకపోతే ముఖ్యమంత్రి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

**రైతుల భూములను కాపాడేందుకు పోరాటం**

ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పరిశ్రమల కోసం కేటాయించిన భూముల విషయంలోనూ అనేక సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల భూముల విషయంలో అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాల్సిన ప్రభుత్వం, ఉన్న భూములపైనే వివాదాలు సృష్టించడం సరికాదన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు.




**"రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు"**

రైతులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, నాయకులు సపన దేవ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయికోడ్ మండలానికి ముగ్గురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

మొదటిపేజీ తరువాయి

**రాయికోడ్ సెప్టెంబర్ 05 (ప్రజా జ్యోతి) :**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని  మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. సంగారెడ్డి జిల్లా ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో వారికి ఘనంగా సన్మానం చేసి అవార్డులు అందజేశారు.రాయికోడ్ మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్  కర్చల్ ప్రధానోపాధ్యాయులు జి. నర్సిములు ( జి హెచ్ ఎం ఎంఈఓ ), జడ్.పి.హెచ్.ఎస్ రాయికోడ్ పాఠశాల ఎస్ ఏ ఇంగ్లీష్  ఉపాధ్యాయురాలు సునంద, ఎంపీపీఎస్  రైకోడ్ పాఠశాల ఎస్ జి టి  బి. శోభ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ సురేష్ షెట్కర్, సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి తదితరులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసి అభినందించారు.విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల పురోగతికి విశేషంగా కృషి చేయడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ,నైతిక విలువలు,సృజనాత్మకతను పెంపొందించేందుకు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి.మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఒకేసారి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం పట్ల మండల విద్యాశాఖ అధికారులు,( ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అవార్డు గ్రహీతలకు పలువురు అభినందనలు తెలియజేస్తూ,భవిష్యత్తులోనూ విద్యారంగానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

ప్రజాజ్యోతి

ఆదివారం 06 సెప్టెంబర్ 2026

# రాజకీయ విమర్శలు హద్దులు దాటితే సహించేది లేదు

- ఆవుల రాజిరెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం: కాంగ్రెస్ ఘాటు హెచ్చరిక
- అభివృద్ధి చేస్తున్న నాయకుడిపై బురదజల్లుడు రాజకీయాలు మానుకోవాలి
- మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వీరన్నగారి కృష్ణారెడ్డి

**వెల్దుర్తి-మాసాయిపేట్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 05:**

నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డిపై మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్ చేస్తున్న ఆరోపణలను మాసాయిపేట మండల కాంగ్రెస్ నాయకులు ఖండించారు. రాజకీయ విమర్శలు చేయడంలో తప్పులేదని, అయితే వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలకు పాల్పడటం సరికాదని అన్నారు. ఇకనైనా బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు మాసాయిపేట మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వీరన్నగారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లలో మాసాయిపేట మండల అభివృద్ధిపై గత పాలకులు తగిన శ్రద్ధ చూపలేదని అన్నారు. హకీంపేట, నాగ్సన్‌పల్లి గ్రామాల రోడ్ల సమస్యను ఇన్నాళ్లు ఎందుకు పరిష్కరించలేదో చంద్రగౌడ్, బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక చొరవతో హకీంపేట, నాగ్సన్‌పల్లి రోడ్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. హకీంపేట రోడ్డు పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, నాగ్సన్‌పల్లి రోడ్డు పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.మాసాయిపేట మండల అభివృద్ధిపై మాట్లాడే ముందు గత పదేళ్లలో తాము చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని అయన సూచించారు. అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో వాటిని గుర్తించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.మాసాయిపేట గ్రామ అభివృద్ధికి నిధులు సమకూర్చడంతో పాటు 49 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఆవుల రాజిరెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన నిరంతరం అందుబాటులో ఉంటున్నారని, నియోజకవర్గవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఆవుల రాజిరెడ్డికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి కొందరు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయాలనుకుంటే విధానాలపై, అభివృద్ధి అంశాలపై మాట్లాడాలని, వ్యక్తిగత ఆరోపణలకు పాల్పడటం తగదని హితవు పలికారు.అదేవిధంగా చంద్రగౌడ్‌పై కూడా ప్రజల్లో వివిధ అంశాలపై చర్చలు, ఆరోపణలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల



కుటుంబాలకు అందాల్సిన పరిహారం విషయంలోనూ, కుటుంబ వివాదాల మధ్యవర్తిత్వానికి సంబంధించిన డబ్బుల వ్యవహారాలపై తనపై వస్తున్న ఆరోపణలపైనా చంద్రగౌడ్ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు సంబంధిత ఆధారాలతోనే తేలాల్సి ఉంటుందని తెలిపారు.ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తనపై వస్తున్న ఆరోపణలకు కూడా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం వల్ల రాజకీయంగా ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.ఇకనైనా చంద్రగౌడ్ వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలకు దూరంగా ఉండాలని మాసాయిపేట మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ విమర్శలకు రాజకీయంగానే సమాధానం ఇస్తామని, అవసరమైతే చట్టపరమైన మార్గాలను కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

## రైతు కుటుంబంలో విషాదం.. కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 05:**



వ్యవసాయ పనుల్లో భాగంగా పొలానికి వెళ్లిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మానేపల్లికి చెందిన రిక్కం శ్రీకాంత్ (30) ఉదయం 6 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. పొలంలో పనులు ప్రారంభించిన కుటుంబ సభ్యులు, కొద్దిసేపటి తర్వాత పంటకు నీరు అందించే క్రమంలో సుమారు 9:30 గంటల సమయంలో మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లిన శ్రీకాంత్‌కు విద్యుత్ షాక్ తగిలింది. తీవ్ర షాక్‌కు గురైన ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే శ్రీకాంత్ మృతి చెందినట్లు తెలిపారు.ఘటనపై సమాచారం అందడంతో ఎస్ఐ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి భార్య అనుష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ కరుణాకర్ రెడ్డి వెల్లడించారు.



## ఉపాధ్యాయులకు ఘన సన్మానం ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

- మార్థి సర్పంచ్ ఏన్నం విజయలక్ష్మి రవీందర్ రెడ్డి

**కల్హేర్ , సెప్టెంబర్ 5: ప్రజా జ్యోతి**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రెడ గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ గ్రామ సర్పంచ్ ఏన్నం విజయలక్ష్మి రవీందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్నం విజయ లక్ష్మి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో గురువుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# అరబ్‌గల్లీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

మెదక్ (ప్రజాజ్యోతి)

మెదక్ మున్సిపల్ పరిధిలోని అరబ్‌గల్లీలో 29వ వార్డులో కౌన్సిలర్ బట్టి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. కొంతకాలంగా పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్రతతో పాటు దోమల సమస్యతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కౌన్సిలర్ బట్టి ఉదయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టించారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.పారిశుద్ధ్య పనులతో ప్రాంతంలో చెత్త, దోమల సమస్య తగ్గుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. వార్డు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి శుభ్రత పనులు చేపట్టించిన కౌన్సిలర్ బట్టి ఉదయ్ కుమార్‌కు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.







# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ (ప్రజాజ్యోతి )



ఈ నెల 12 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని . జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఏసి సెక్రెటరీ శ్రీమతి ఆర్. సిరి సౌజన్య తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.నెల 12 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఎఫ్ఏసి సెక్రెటరీ శ్రీమతి ఆర్ సిరి సౌజన్య పాత్రికేయులు సమావేశంలో వెల్లడించారు.శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయస్థానాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకునే కంటే.. పరస్పర అంగీకారంతో సమస్యలను ముగించుకునే రాజీ మార్గమే కక్షిదారులకు నిజమైన రాజమార్గం అన్నారు. ప్రజలకు త్వరితగతిన, అత్యంత సులభంగా, తక్కువ ఖర్చుతో చట్టబద్ధమైన న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ నెల 12 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు, కక్షిదారులు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ జాతీయ లోక్ అదాలత్లో పెండింగ్లో ఉన్న సివిల్ కేసులు, భూసేకరణ కేసులు మున్సిపల్ ఇన్సూరెన్స్, బ్యాంకు కేసులను కూడా ఎటువంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు.

# శారీరక దారుఢ్యంతోనే సమర్థవంతమైన పోలీసింగ్

మెదక్ (ప్రజాజ్యోతి)



పోలీసులు ఆరోగ్యంగా, మాన సికంగా దృఢంగా ఉంటేనే విధుల్లో మెరుగైన ఫలితాలు విధి నిర్వహణలో పోలీసులు శారీ రకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్



సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్ నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి పరేడ్, శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోలీసు జాగిలాల పనితీరును పరిశీలించి, వాటి శిక్షణకు సంబంధించిన అంశాలను అధికారులకు వివరించారు. నేరాల నియంత్రణ, అనుమానితులను గుర్తించడం, పేలుడు పదార్థాలు తదితర అంశాల్లో పోలీసు జాగిలాల సేవలు ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు.పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అవసరమని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై నిరంతరం దృష్టి సారించాలని అధికారులు స్పష్టం చేశారు.

# వెయ్యి రోజుల పాలనకు లెక్క చెప్పాలి.. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ సమరశంఖం

## - కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ తీవ్ర విమర్శలు

తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 05:



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఇచ్చిన హామీలు, వాటి అమలుపై బీఆర్ఎస్ ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా తూప్రాన్ మున్సిపాలిటీ 4వ వార్డులో కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ ఇంటింటికీ తిరుగుతూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలుపై కాలయాపన చేస్తూ ప్రజలను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు.రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఆటో డ్రైవర్లు, ఉద్యోగులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటలను గుర్తు చేస్తూ 'బాకీ కార్డు' ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత పాలనలో ప్రజలకు ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందడం లేదని జైపాల్ నాయక్ అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు మరింత పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్, కొత్త నర్సింలు, శ్రీకాంత్, నరేష్, హైమద్, శ్రీను, శేఖర్, లూకా తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

## మెదక్‌లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు





**మెదక్ (ప్రజాజ్యోతి)**

విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు భావి భారత పౌరులుగా రూపొందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెదక్ ఐడీఓసీ కార్యాలయంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మంది ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు శాలువాలు మెమొంటోలతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మున్సిపాల్ చైర్మన్ రాధిక భూపతి రాజు తదితరు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు జెడ్పిసిఈఓ ఎల్లయ్య ఏడి శ్రీనివాసరావు సిఎం ఓ రాజు ఏఎంవో సుదర్శన్ మూర్తి ఏఎస్ఓ నవీన్ వివిధ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కార్యదర్శులు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి






**మెదక్ (ప్రజా జ్యోతి)**

చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లలో సమర్థవంతమైన పోలీసింగ్‌తో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పోలీస్ సిబ్బంది కిట్లను పరిశీలించారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఎఫ్ఐఆర్‌ల నమోదు, క్రైమ్ డైరీలు, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ అమలు, సీసీటీవీ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి పెండింగ్ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.బాధితులకు సత్వర న్యాయం అందేలా నాణ్యమైన, పారదర్శక దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని, సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. దుకాణాలు, వ్యాపార సంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు.గ్రామాల్లో పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయడంతో పాటు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సస్పెక్ట్ కదలికలపై నిరంతరము నిగా కొనసాగించాలని బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడుతూ అనుమానాస్పద వ్యక్తులు కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమయి విధుల నివారణ పై పలు సూచన చేశారు. విధి నిర్వాహంలో క్రమశిక్షణ అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు సిబ్బంది విధులకు సంబంధించి అంశాలతో పాటు వారి వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకుని అవసరమైన సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎలాంటి ఆందోళన గురికాకుండా వెంటనే కొత్తగా నూతనంగా ఏర్పాటు చేసిన డయల్ 112 కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు ఆపదలో ఉన్న వారికి తక్షణం పోలీస్ సహాయం అందేలా 112 సేవలకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఎస్పీ వెంట డిఎస్పి నరేందర్ గౌడ్ సిఐలు సందీప్ రెడ్డి రంగాకృష్ణ ఎస్సై నర్సింలు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ పట్టణంలోని పంచగమా కమాన్ వద్ద శనివారం నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్, జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమానులు హన్మయ్య ముదిరాజ్, సతీష్, జర్నలిస్ట్ పరమేశ్వర్‌లను ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జర్నలిస్టులు పాల్గొని నూతన గృహ యజమానులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.







# గురువులకు ఘన సత్కారం..

## వెంకటాయపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సందడిగా గురుపూజోత్సవం



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 05:**

తూప్రాన్ మండలం వెంకటాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత తొలి ఉపరాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గురువుల ప్రాధాన్యత, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధి రాములు మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యను అందించడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించి వారిని బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ గురువులపై అభిమానాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు




శివకుమార్, వసుధరతన్, రవీందర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా మినుము సాగుపై క్షేత్ర ప్రదర్శన

**రాయికోడ్ సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):**

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా మినుము సాగు ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆత్మ ఆధ్వర్యంలో శంషోద్దీన్పూర్ గ్రామంలో క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పై వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. నేల స్వభావాన్ని బట్టి సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువులు, సూక్ష్మ పోషకాల వినియోగంతో పాటు ఆధునిక పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. మినుము పంటలో మొక్కల ఎదుగుదల, పూత, దిగుబడి పెంపునకు శాస్త్రీయ సాగు పద్ధతులు అవలంబించాలని తెలిపారు. అలాగే రైతులకు నానో డిఏపి, నానో యూరియా పంపిణీ చేసి, వాటి వినియోగ విధానం, సరైన సమయంలో పంటకు అందించడం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులను సిఫారసు చేసిన మోతాదులోనే వినియోగించాలని అధికారులు సూచించారు. ఆయిల్‌పామ్ తోటల ప్రారంభ దశలో అంతర పంటగా మినుము సాగు చేయడం వల్ల భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు రైతులకు అదనపు




ఆదాయం లభించే అవకాశం ఉంటుందని వివరించారు. అంతర పంట సాగులో పంటల మధ్య తగిన దూరం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, పోషక యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో రాయికోడ్ మండల వ్యవసాయ అధికారి సారిక, ఏఈఓ మమత, ఏటీఎం రమేష్ పాల్గొని రైతులకు పంట సాగుపై సాంకేతిక సూచనలు అందించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా బి. సురేష్ కల్హేర్ ఎంఈఓకు ఘన సన్మానం

**కల్హేర్. 5.సెప్టెంబర్.ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవం2026 కార్యక్రమంలో కల్హేర్ మండల విద్యాధికారి బి. సురేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యులు చిన్నమైల్ అంజిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి చేతుల మీదుగా బి. సురేష్ అవార్డును స్వీకరించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలు , విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బి. సురేష్‌ను పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.



# విజ్ఞాన్ హైస్కూల్లో విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ తరగతి గదుల్లోకి వెళ్లి తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుల పాత్రను అనుభవించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బోధనా నైపుణ్యాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం తోటి విద్యార్థులను ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేష్ గౌడ్, డైరెక్టర్లు అంజా గౌడ్, డాక్టర్ దిగ్గే బాబు, ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పోరుబాట

## - ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్..

## - జోగిపేటలో భారీ నిరసన ర్యాలీ

**అందోల్, సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):**

విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జోగిపేటలో విద్యార్థులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్‌స్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలని, పాలిటెక్నిక్ విద్యను ఇంజినీరింగ్ విద్యగా గుర్తించాలని కోరారు. 95 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పి జైపాల్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్లు పి నారాయణ ముదిరాజ్, డి.బి.నాగభూషణం మాజీ ఎంపీపీలు అర్జునయ్య, జె.బాలయ్య బిఆర్ఎస్ నాయకులు లింగా గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, వసంత్ రెడ్డి, బిర్ల శంకర్, మహేష్ యాదవ్, దాసరి దుర్గయ్య, కరుణాకర్, పరిపూర్ణం,నిరుడి లక్ష్మణ్, నాజీం పటేల్, ఇమ్రాన్ ఖాన్, అల్లే సంతోష్, ప్రభాకర్, సుంకే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట మైనార్టీ బాయ్స్ రెసిడెన్షియల్ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం

**అందోల్, సెప్టెంబర్ 05, (ప్రజాజ్యోతి):**




జోగిపేటలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాల (టిజీఎంఆర్ జెసి)లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుపూజోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్. సౌజన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సౌజన్య మరియు ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్. సౌజన్య మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రతీ విద్యార్థి జీవితంలో గురువు చూపే మార్గం వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని, ఉపాధ్యాయుల విలువైన సూచనలను పాటిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులుగా సాంబయ్యకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 05:**

విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్యకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. కొడంగల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన సభలో తెలంగాణ విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. ఈ. నవీన్ నికోలస్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా సాంబయ్య అవార్డును అందుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కడం పట్ల వెల్దుర్తి మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సును జయప్రదం చేయండి

## - విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి

## -ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ రాష్ట్ర నాయకులు డా. డి. ఓంప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.ఏ. ఖైసర్

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**

విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సును జయప్రదం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులు డా. డి. ఓంప్రకాష్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యం.ఏ. ఖైసర్ పిలుపునిచ్చారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ..విద్యా హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 6వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవన్‌లో మధ్యాహ్నం 1 గంట నుంచి ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన సదస్సుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్య ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అని,ఆ హక్కు సమర్థవంతంగా అమలయ్యేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విద్యా హక్కు చట్టం అమలు తీరు, పాఠశాలల్లో విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగంలో ప్రభుత్వశీ బాధ్యత తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ చైర్మన్,జేఎన్‌టీయూ ప్రొఫెసర్ నవోదయ సిద్ధార్థతో పాటు పలువురు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, మానవ హక్కుల ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. కావున విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యారంగంపై ఆసక్తిగల వారు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు ఈ



సదస్సు వేదికగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

# ఉపాధ్యాయులకు అమీన్ పూర్ పోలీసుల ఘన సన్మానం

## - విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రతపై అవగాహన





**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)**

భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అమీన్ పూర్ సిఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అమీన్ పూర్ పోలీసుల ఆధ్వర్యంలో బీరంగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బారి సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలో విద్యాబోధనతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి సేవలందిస్తున్న 33 మంది ఉపాధ్యాయులను సిఐ ప్రవీణ్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, మహిళల భద్రత, బాలల రక్షణ తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారి సూచనలు పాటించాలని, విద్యపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.సోషల్ మీడియా దుర్వినియోగం, మాదకద్రవ్యాల బారిన పడిన వారిని సమాజం వెలివేయకుండా, సానుభూతితో ఆదరించి అవసరమైన సహకారం అందించాలని పోలీసులు సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో రాణించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించడంతో పాటు పోలీస్‌ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యమని సిఐ తెలిపారు.

# ఆధ్యాత్మికతతో పాటు ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం

## -వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.

## -బీరంగూడలో నూతన షాప్ ప్రారంభోత్సవంలో ఈర్ల రాజు ముదిరాజ్





**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

ధర్మ పరిరక్షణతో పాటు వ్యాపార, ఉపాధి అవకాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అమీన్ పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ శ్రీకృష్ణ భగవానుడి బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.
అనంతరం భక్తులు, నాయకులు, మిత్రులతో కలిసి ధర్మం, ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై చర్చించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు. భక్తి, ధర్మంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిష్టయ్య యాదవ్, సన్నీ యాదవ్, రాజాచారి పంతులు తదితరులు పాల్గొన్నారు.

**డ్రైఫ్రూట్స్ షాప్ ప్రారంభం**

అనంతరం అమీన్ పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో రాజస్థానీ మార్వాడీలు నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైఫ్రూట్స్ షాప్‌ను ఈర్ల రాజు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నూతనంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. యువత, వ్యాపారులు కొత్త ఆలోచనలతో ముందుకు రావడం అభినందనీయమని, వ్యాపార అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, స్థానిక ఆర్థిక ప్రగతికి పరస్పరం సహకరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు మనోజ్, విట్టల్, పరమేశ్వర్, దీపక్, మనోహర్, రతన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.:.వ

# గురువుల సేవలకు ఘన సత్కారం

## - వట్టిపల్లిలో ఘనంగా గురుపూజోత్సవం..

## - 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**వట్టిపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):**

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని వట్టిపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీడీవో ఎస్ఏఎల్ తరుణ్, తహసీల్దార్ జంగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలో విద్యారంగంలో విశిష్ట సేవలందించిన 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేసి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని, విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణతో పాటు విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం పొందిన వారిలో బాబురావు, సుకన్య, శ్రీలత, నాగయ్య, కవిత, సుధాకర్, ఆంజనేయులు, శైలు, అరుణ, అనిల్, కార్తీక్, నాగరాజు, బిక్షపతి, పరమేష్, సుజాత ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ఫారాలు సరి చేసుకోవాలి

## సర్పంచ్ అభి బాబి

**రాయికోడ్ సెప్టెంబర్ 05 (ప్రజా జ్యోతి ) :**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా తమ ఫారాలు,సంబంధిత ధ్రువపత్రాలను అధికారులకు అందించాలని మాటూర్ గ్రామ సర్పంచ్ అభి బాబి సూచించారు. శనివారం మాటూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సంబంధిత అధికారులతో కలిసి నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి ఎస్ఐఆర్ ఫారాలను సర్పంచ్ స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్లు తమకు కేటాయించిన సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు. సమర్పించిన వివరాలను మ్యాచింగ్,మిస్‌మ్యాచింగ్ ప్రక్రియ ద్వారా పరిశీలించి,బీఎల్ఓల ద్వారా ధ్రువీకరించిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మసూద్ షరీఫ్, సర్పంచ్ అభి బాబి, పంచాయతీ కార్యదర్శి జావిద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్సూద్, ఉప సర్పంచ్ నాగరాజ్, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, రాజిరెడ్డి,జీపీఓ సంజీవ్, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు,ఆర్ఐ సుభాష్‌రెడ్డి, ప్రశాంత్ బాబు,సాబ్, తుల్జమ్మ, లలితమ్మ, వార్డు సభ్యులు, బీఎల్ఏలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# విజేత హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్లో ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను సరైన దిశలో నడిపించే మార్గదర్శకులు ఉపాధ్యాయులని, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవం, కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలని, వారు చూపించే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# మక్దుంపల్లి గ్రామంలో ఉపాధ్యాయ దినోత్సవం

**మునిపల్లి సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):**

శనివారం రోజున మునిపల్లి మండలం మక్దుంపల్లి గ్రామంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులకు సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరళ దయానంద్ ఉపసర్పంచ్ రామలక్ష్మి శేఖర్ మాజీ సర్పంచ్ అశోక్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంషీద్ పటేల్ రామ్ ప్రవీణ్ కుమార్ శేఖర్ మల్లయ్య తుల్జారాం తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ అనామలిస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత

## ఈనెల 5, 6,12,13, తేదీల్లో స్పెషల్ కంపేయిన్ నిర్వహణ.



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు (అనామలిస్), నో మ్యాపింగ్ ఓటర్లకు ఆలస్యం చేయకుండా నోటీసులు జారీ చేయాలని, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ కంపేయిన్ లలో బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలో ఎస్ఐఆర్ అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ,ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ కంపేయిన్ వంటి తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, ఎస్ఐఆర్, అనామలిస్ ,నో మ్యాపింగ్ ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు వేగంగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేయడంలో ఆలస్యం చేయవద్దని, నోటీసు అందుకున్న ఓటరు విచారణకు తప్పనిసరిగా హాజరై సంబంధిత వివరాలు సమర్పించాలని తెలిపారు. ఓటరు కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అవసరమైన పత్రాలతో విచారణకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. బీఎల్ఓలు ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాలను ఓటర్లకు పూర్తిగా తెలియజేయాలని సూచించారు. ఓటర్లు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాని వివరాలను సమర్పించాలని తెలిపారు. నోటీసులు జారీ చేసేటప్పుడు అందులో స్థలం, తేదీ, సమయం స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి పౌరుడు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు మొదటి దశ ఈ నెల 5 ,6వ తేదీ ఆదివారం , రెండవదశ 12వ తేదీ శనివారం, 13వ తేదీ ఆదివారం స్పెషల్ కంపేయిన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన సవరణలు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా దరఖాస్తు చే సుకునేందుకు ,బి ఎల్ ఓ లు సహకార్తిస్తారని అన్నారు . జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ కంపేయిన్ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 5,6, 12, 13 తేదీ లలో స్పెషల్ కంపేయిన్ కొనసాగనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు తమకు



సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ కంపేయిన్లు జరిగే రోజుల్లో సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా హాజరవుతారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సూచించారు. దరఖాస్తుదారులు, ఓటర్లు తమకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలకు హాజరై ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. ముఖ్యంగా తమ పేరు జాబితాలో ఉందో లేదో, నమోదైన వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులు, మార్పులు లేదా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సవరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సంబంధిత ఈఆర్ఓ లు , ఏఈఆర్ఓలు కార్యాలయాల్లో కూడా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు స్పెషల్ కంపేయిన్ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్ జన్మదిన వేడుకలు..





**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ప్రజా జ్యోతి రిపోర్టర్ హెచ్. శేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతపల్లి సర్పంచ్ అనంతరెడ్డి, ముని దేవుని పల్లి సర్పంచ్ కృష్ణ శేఖర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల రవి శేఖర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయనను అభినందించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, శేఖర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో తోటి రిపోర్టర్లు, జర్నలిస్టులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని శేఖర్‌కు శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకల్లో పాల్గొని శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన గుంతపల్లి సర్పంచ్ అనంతరెడ్డి, ముని దేవుని పల్లి సర్పంచ్ కృష్ణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల రవి, తోటి రిపోర్టర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించాలి

## - ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి

## - ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు





**జహీరాబాద్, సెప్టెంబర్ 05 ( ప్రజా జ్యోతి న్యూస్ )**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా దీ=వా / దీ=వాం ఆధ్వర్యంలో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు నాయకత్వంలో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీఅధ్యక్షులు వెంకటేశం,మొగుడం పల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, మాజి మున్సిపల్ చైర్మన్ తంజిం, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, బొగ్గుల సంగమేశ్వర్, నరసింహ గౌడ్, నరసింహ రెడ్డి, సురేష్, కళీమ్, పట్టణ కౌన్సిలర్ లు వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజి సర్పంచ్ లు, మాజి ఎంపీటీసీ లు తదితర నాయకులు విద్యార్థులు, యువత సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ మోర్ సూపర్ మార్కెట్ నుండి కుమార్ హోటల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి విద్యార్థులు, యువతతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జీవో 97 పై కాంగ్రెస్ సర్కార్ ను అసెంబ్లీలో ఎండగడతాం.. లి జీవో 97ను రద్దు చేసే వరకు పాలిటెక్నిక్ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్ను..

జీవో 97 వెనుక అసలు ఉద్దేశాన్ని బయటపెడతాంపాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములు, ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నేసిందని ఎమ్మెల్యే మాణిక్ రావు ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు తీసుకొచ్చిన జీవో నంబర్ 97 వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతామని స్పష్టం చేశారు. జీవో 97ను రద్దు చేసే వరకు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే దీ=వా పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు బిఆర్ఎస్వి జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు రాకేష్, జే.రవి కిరణ్, ఓంకార్, పారశు రాం, ఫయాజ్, మారుతీ యాదవ్, అశోక్ రెడ్డి, రఘు తేజ, నవీన్ తేజ, మధు, ఇక్బాల్, ప్రసాద్, లవన్, రవి, మరియు బి.ఆర్.ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై భూపాల్ రెడ్డి ధ్వజం

## - యువత,విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ













**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం నారాయణఖేడ్‌లో యువత, విద్యార్థుల సమస్యలపై భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు వ్యతిరేకిస్తున్న జీవో 97ను ప్రభుత్వం పునఃపరిశీలించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో ఎన్నిసార్లు ప్రశ్నించారని ప్రశ్నించారు. నారాయణఖేడ్ యువత, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఎన్నికల హామీల అమలు, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ విద్యార్థుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, కౌన్సిలర్ విజయ్ బుజ్జి, పట్టణ అధ్యక్షుడు బాదల్ గామ నగేష్, నజీబ్, ముజమ్మిల్, రవీందర్ నాయక్, జగదీశ్వర్ చారి, సామేల్, దస్తగిరి, లక్ష్మణ్, సాయి, మల్గొండ, భూపాల్, నర్సా గౌడ్, రాజు నాయక్, సద్దాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మునిపల్లి మండలంలో 70వ SGF మండల స్థాయి క్రీడా పోటీలు

**మునిపల్లి, 5 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**

మునిపల్లి మండలంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ూా+ఖీ) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. ఈ మేరకు పోటీల నిర్వహణకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో మండల వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల నిర్వహణ, విద్యార్థుల పాల్గొనడం, జట్ల ఎంపిక, క్రీడా ప్రాంగణాల ఏర్పాట్లు తదితర అంశాలపై వ్యాయామ ఉపాధ్యాయులతో చర్చించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి ప్రతిభ కలిగిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**క్రీడల షెడ్యూల్:**

సెప్టెంబర్ 9న అండర్-14, అండర్-17 బాలురు, బాలికలకు వాలీబాల్, సెప్టెంబర్ 10న ఖో-ఖో, సెప్టెంబర్ 11న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. అండర్-14 విభాగంలో 01-01-2013 తర్వాత జన్మించిన విద్యార్థులు, అండర్-17 విభాగంలో 01-01-2010 తర్వాత జన్మించిన విద్యార్థులు పోటీలకు అర్హులని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ు+ూా హైస్కూల్, లింగంపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను పోటీలకు సిద్ధం చేసి, క్రీడాస్ఫూర్తితో పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కోరారు.

MEO.Munipally

# కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## - మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి






**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు..ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కోరారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు, ఉన్నత అవకాశాలు సాధించాలంటే కష్టపడి చదవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ వారి సూచనలు పాటించాలని విద్యార్థులకు హితవు పలికారు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లను అవసరానికి మించి వినియోగించకుండా చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జనార్ధన్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు రూ.49 లక్షల నిధులు

## - గణేష్ నిమజ్జనం, బతుకమ్మ, దసరా ఏర్పాట్లకు ఆమోదం

**అందోల్, సెప్టెంబర్ 5, (ప్రజా జ్యోతి):**

అందోల్-జోగిపేట పురపాలక సంఘ పరిధిలో వివిధ అభివృద్ధి, నిర్వహణ పనులకు రూ.49 లక్షల నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ సాధారణ సమావేశం ఆమోదం తెలిపింది. శనివారం మునిసిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 42 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. పురపాలక నిర్వహణతో పాటు గణేష్ నిమజ్జనం, బతుకమ్మ, దసరా వేడుకల ఏర్పాట్లకు నిధులు వినియోగించనున్నారు. వివిధ వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, కమిషనర్ సీహెచ్ తిరుపతి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిమ్జ్ లో స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

## - సయ్యద్ జలాలుద్దీన్, సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

## - విద్యా వైద్య ఉపాధి హక్కులకై సమరశీల పోరాటాల సిద్ధం కండి

## - యన్.శ్రీకాంత్ ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

**జహీరాబాద్, సెప్టెంబర్ 05 ( ప్రజా జ్యోతి న్యూస్ )**

అఖిలభారత యువజన సమాఖ్య సంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి సమావేశం శనివారం జహీరాబాద్, భారత్ నగర్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి జిల్లాలుద్దీన్ మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లాలో అనేక పరిశ్రమల ఏర్పాటు కోసం స్థానికుల వద్ద వారి భూములను ప్రభుత్వం తీసుకొని పరిశ్రమల ఏర్పాటుకు స్థానికులు సహకరిస్తుంటే ప్రభుత్వాలు స్థానిక పరిశ్రమలలో యువకు లకు ఉద్యోగ అవకాశాలు కల్పించ కపోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న నిమ్జ్ లో స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి లేనియెడల యువజన సమాఖ్య ఆధ్వర్యంలో యువకులను సమీకరించి ఉద్యమ బాట ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్య వైద్యం ఉపాధిలు అందని ద్రాక్షగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్య పాలసీతో విద్యను అంగడి సరుకుగా మార్చి విద్యా రంగంలో కాషాయ కరణ అమలు చేస్తూ భారతదేశ చరిత్ర పుటలను ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ త్ విష బీజాలను నాటుతున్నారని మండి పడ్డారు. విద్యా వైద్య ఉపాధి హక్కులకై సమరశీల పోరాటాలకు యువతి యువకులు నడుం బిగించా లని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8న యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల సందర్భంగా యువజన కవాత్ నిర్వహిస్తున్నామని 9, 10 తేదీలలో ప్రతి నిధుల సభలు జరగతాయని యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ ఆనంద్, అనంతరం సంగారెడ్డి జిల్లా ఎఐ వైఎఫ్ నుతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. జిల్లా కన్వీనర్ గా యం.సతీష్ కో కన్వీనర్లుగా టి.రాజు, సయ్యద్ అజీజ్, సభ్యులుగా పాండు, కీర్తి కుమార్, రాములు, శ్రీకాంత్ ఎన్నికయ్యారు.



# జర్నలిస్టుల హక్కుల కోసం.. టీఎంజేఎఫ్ సమరశంఖం!

- 12న హైదరాబాదులో నిర్వహించనున్న 3వ రాష్ట్ర మహాసభలు..
- కరపత్రాలను ఆవిష్కరించిన మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం
-“ జనం కోసం జర్నలిజం.. ప్రజల గొంతుకకు స్వేచ్ఛ.. జర్నలిస్టు కలానికి భద్రత ” - చెల్మెడ అనిల్‌కుమార్

**జహీరాబాద్, సెప్టెంబర్ 05 ( ప్రజా జ్యోతి న్యూస్ )**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) 3వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శనివారం జహీరాబాద్ పట్టణంలో ఆవిష్క రించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థా పకులు బూర్గుల నరేందర్ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్ కుమార్, బొడ్డు నాగేష్ ఆధ్వర్యంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీఎంజేఎఫ్ రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్‌కుమార్ మాట్లాడుతూ “జనం కోసం జర్నలిజం.. ప్రజల గొంతుకకు స్వేచ్ఛ.. జర్నలిస్టు కలానికి భద్రత.. మీడియాలో సామాజిక ప్రాతినిధ్యం” అనే లక్ష్యాలతో టీఎంజేఎఫ్ పని చేస్తోందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు మీడియా లో సామాజికంగా అణగారిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.జర్నలిస్టుల హక్కులు, సమస్యల పై ఐక్యంగా పోరాడేందుకు రాష్ట్ర మహాసభలు వేదికగా నిలవనున్నాయని తెలిపారు. ఈ నెల 12న హైదరాబాదులో నిర్వహించనున్న టీఎంజేఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలను విజయ వంతం చేయాలని జర్నలిస్టులు, ప్రజలు, మాదిగ సమాజ ప్రతి నిధులకు అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు.



# శ్రీ రామలింగేశ్వర ఆలయంలో శ్రావణ పూజలు

## - కీర్తిశేషులు దారం రఘురాములుశాంతాబాయి

## జ్ఞాపకార్థం అన్న ప్రసాద వితరణ

**కల్హేర్, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి, అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపట్టారు.ప్రతి ఏటా ఆలయంలో సంప్రదాయబద్ధంగా శ్రావణ మాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### అంజనాద్రి క్షేత్రం నుంచి మహాపాదయాత్ర ప్రారంభం



కల్హేర్ మండలం బ్రహ్మణపల్లిలోని అంజనాద్రి క్షేత్రం నుంచి శనివారం మహాపాదయాత్ర ఘనంగా ప్రారంభమైంది. భక్తులు, హిందూ ధర్మాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పాదయాత్రను కొనసాగించారు. ముందుగా అంజనాద్రి క్షేత్రంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాపాదయాత్రను ప్రారంభించారు. ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడం,



హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా ఈ మహాపాదయాత్ర చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

### రామమందిరంలో అన్న ప్రసాద కార్యక్రమ నిర్వహణ

కీర్తిశేషులు హిందీ పండిత్, ఉపాధ్యాయులు దారం రఘురాములు శాంతాబాయి జ్ఞాపకార్థం వారి కుమారుడు, నిరంతర అన్న ప్రసాద సేవకులు దారం సామ్య సంజీవ్ కుమార్ సెట్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు : శ్రీ రామమందిరం, కల్హేర్ ఈ అన్న ప్రసాద కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలందరూ హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. శ్రీరాముని ఆశీస్సులు అందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు.

# సర్టిఫికెట్లు ఇవ్వక.. లాసెట్ సీటు కోల్పోయా!

# ఫీజు బకాయిలతో విద్యార్థుల భవిష్యత్ బలి

## - విద్యార్థుల ఆందోళన ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్






**కల్హేర్ , సెప్టెంబర్ 5 ( ప్రజా జ్యోతి)**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో లాసెట్‌లో సీటు వచ్చినప్పటికీ అడ్మిషన్ పొందలేకపోయానని ఓ విద్యార్థి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఫీజు బకాయిల కారణంగా సర్టిఫికెట్లు అందకపోవడంతో తనకు వచ్చిన లాసెట్ సీటును కోల్పోవాల్సి వచ్చిందని తెలిపాడు. శనివారం నారాయణఖేడ్‌లో విద్యార్థులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఫీజులను చెల్లించి విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ధర్నాలు చేస్తున్నా పట్టించుకోరా?**

విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు నిలిచిపోతున్నాయని, ఫలితంగా ఉన్నత విద్యకు వెళ్లాల్సిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది**

మాజీ ఎమ్మెల్యే. యం.భూపాల్‌రెడ్డి

యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే నాడు కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో జరిగిన విద్యార్థుల ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు , చదువులు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులు కోల్పోతున్న విద్యా అవకాశాలను తిరిగి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భూపాల్‌రెడ్డి కోరారు.

---

# పల్లెల్లో పంటల రాశులు లేవు. మద్యం సీసాల రాశులు పెరుగుతున్నాయి.

**మునిపల్లి, సెప్టెంబర్ 5(ప్రజాజ్యోతి):**





ఒకప్పుడు పల్లెల్లో రకరకాల పంటలు పండించిన రైతుల ఇళ్లల్లో వూరు వాడల్లో ఎక్కడ చూసినధాన్యపు రాశులు కనిపించేవి. గత 10 సంవత్సరాల నుండి గ్రామాల్లో కేవలం పత్తి పంటలకే రైతులు పరిమితమయ్యారు. అంతేకాకుండా వ్యవసాయ రంగంలో రోజురోజుకు పెరుగుతున్న పెట్టుబడుల దృష్ట్యా,కూలీల కొరత కారణంగా ఎద్దు ఎవుసం కురైతులు దూరమై కేవలం ట్రాక్టర్లు,ఇతర యంత్ర పరికరాలతో మాత్రమే వ్యవసాయము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అవసరానికి సరిపోను కూలీలకు కూడా మద్యం పోయించక తప్పని పరిస్థితి నెలకొందని రైతులు చెపుతున్నారు. అంతేకాకుండా రాజకీయ రంగములో కూడా పెను మార్పులు వచ్చాయని చెప్పవచ్చు. నాయకులకు ఓటు వేయించుకోవాలని స్వార్థం,ఓటర్లకు మద్యం సేవించాలనే ఆశ పెరగటంతో కూడా మద్యం గిరాకులు పెరుగుతున్నాయని పలు సర్వేలు చెపుతున్నాయి. కారణాలను విశ్లేషిస్తే కర్ణుని చావుకు వంద కారణాలు అన్న చందంగా , నేడు గ్రామాల్లో వయస్సు తో నిమిత్తం లేకుండా సమయంతో పనిలేకుండా ప్రజలు మద్యం సేవిస్తున్నారు. ఒక్క మునిపల్లి మండలములో మూడు వైన్స్ లు వున్నాయి. అంతటితో ఆగకుండా గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఒళ్ళు ఇల్లు గుళ్ళచేసుకొని ప్రజలు మద్యానికి బానిసలవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.పల్లెల్లోకుటుంబ జీవనానికి వ్యవసాయ భూములే ఆధారము అలాంటిది భూములను అమ్ముకొని మద్యం మాంసం లాంటి దుర్వాసనాలకు ప్రజలు బానిసలవుతున్నారని సంఘసంస్కర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ఏ మేరకు సేవిస్తున్నారణడానికి నిదర్శనం ఓ స్క్రాప్ షాపు దగ్గర ప్రజా జ్యోతి కి కంటపడిన కాళీ మద్యం సీసాల కుప్పలు ఆచర్యానికి గురి చేసింది ఈ దృశ్యం.